## చిట్టి కథ



# ఆశయం

ఆనందరావు దంపతులది పెద్ద ఉమ్మడి కుటుంబం. నలుగురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్ళు. అందరూ జీవితంలో స్థిరపడిపోయారు. అన్నదమ్ములు అందరూ కలసివుంటున్నారు.

ఒక్క ఆనందరావుకి తప్ప మిగతా వారందరికీ మగపిల్లలే. ఆనందరావుకి మాత్రమే ఒక్కతే ఆడపిల్ల. పేరు కల్పన. పేరుకు తగినట్లు ఎంతో సున్నితంగా, కవుల కల్పనకు ప్రతీకగా వుంటుంది. ఆ ఇంట్లో అందరికీ కల్పన అంటే పంచప్రాణాలు. బామ్మ తాతలకి ప్రాణం.

అల్లారు ముద్దుగా పెరిగి యవ్వనంలోకి అడుగుపెట్టింది కల్పన. కాలేజి చదువుకు వచ్చింది. ఆరోజు కాలేజీలో తెలుగు లెక్చరర్ క్లాసులో నోటీను వచ్చింది. ఏమిటంటే వక్తృత్వపు పోటీలలో పాల్గొనే విద్యార్థినులు పేర్లు ఇవ్వాలని. అంతే... స్నేహితులంతాచేరి కల్పన పేరు ఇచ్చేట్లు చేశారు. టాపిక్ కూడా యువతీయువకులకు తగినదే. "మీ జీవిత భాగస్వామి ఎటువంటి వ్యక్తి అయివుండాలి?" అని!

ఇంటికి వచ్చేక గబగబా స్నానంచేసి టిఫిన్‌తిని పురాణం వినడానికి వెళుతున్న నాయనమ్మదగ్గరకు పరుగెత్తింది. ఎలా అడగాలో తెలీక ముందుకాస్త తికమకపడింది. చివరికి అడిగేసింది. అదివిని వాళ్ల నాయనమ్మ "ఓస్... ఇదా సంగతి. అయ్యో... మాకాలంలో అసలు ఈ ఆలోచనకే తావులేదే అమ్మా. అన్నీ పెద్దవాళ్ల నిర్ణయాలే... పెళ్లయ్యాక ఎంత సేపూ అత్తగారు, మామగారు, బావగారు, వాళ్ల పనులు చూడటంతోనే సరిపోయేది. నీకుతెలుసో, తెలీదో నేను 15 సంవత్సరాలు అసలు సూర్యుణ్ణి చూడలేదంటే నమ్ము. సరేలే నాకు పురాణానికి టైమైంది" అని వెళ్ళిపోయింది.

అంతే... డిబేట్‌లో ఏంచెప్పాలో వెంటనే రాసేసుకుంది. ఎలాగో పదిరోజులు గడిచాయి. ఆరోజే డిబేట్... తనవంతు రాగానే మొదట కొంచెం బిడియపడినా గడగడా చెప్పేసింది."ఇది ఈతరం ప్రశ్న. మన ముందు తరాలలో అస్సలు ఈప్రశ్నకే తావులేదు. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసేవారు. వాళ్లు పతియే ప్రత్యక్ష దైవం అన్నసూత్రం జీర్ణించుకునేవారు. వాళ్లకి వూహ తెలిసే సరికే వాళ్ల జీవితభాగస్వామి ఎదురుగా వుండేవాడు. ఉమ్మడి కుటుంబాలలో "నాపిల్లలు, నాజీవితం" అని ఆలోచించటానికే సమయం వుండేదికాదు. ఆ విషయంలో మనం ఎంతో అదృష్టవంతులం. నామట్టుకు నాకు రాబోయే జీవనభాగస్వామి ముఖ్యంగా మంచి మనసున్నవాడు కావాలి. వరకట్నం అనవసరం అనేవ్యక్తి కావాలి. ఆడది వంటింటికే అంకితం అన్న భావం కలిగివుండకూడదు. అన్నివిషయాల్లో ఇద్దరూకలిసి ఆలోచించి సహజీవనం గడపాలి..." ఇలా సాగిపోయింది ఆమె ఉపన్యాసం. ముగించేసరికి హాలంతా చప్పట్లతో మారుమ్రోగింది.

పోటీలో మొదటి బహుమతి వెండి కప్పు తీసుకుని ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా హడావిడిగావుంది. కల్పనని చూడగానే వాళ్ల పెద్దఅత్తయ్య "రావే కోడలా... నీగురించే మాట్లాడుకుంటున్నాం" అంటూ ఎదురొచ్చి తీసుకువెళ్లింది. తనుపొందిన బహుమతిని అందరికీ చూపించాలని ఎంతో సంతోషంతో వచ్చిన కల్పన అసలు విషయం మరిచిపోయి వాళ్ళమ్మపక్కన గువ్వలా కూర్చుంది.

తర్వాత అసలు సంగతి తెలిసింది. ఒక్కగానొక్క కూతురుకు బయట సంబంధం చేస్తే ఎలాంటివరుడు వస్తాడో ఏమిటో అని, కల్పనని వాళ్ళబావ మహేష్‌కే ఇచ్చి చేయాలని అందరూ కలిసి నిర్ణయించారు.

సంగతి విన్న కల్పన నిర్విణ్ణురాలైంది. వాళ్ళబావ మహేష్ చెడ్డవాడుకాదు కానీ చాలా అహంభావి. తనే పెద్ద అందగాడిననీ, తామే ఆస్తిపరులమని, తను మెడిసన్ చదువుతూవుండడం చాలా గొప్ప విశేషం అని విపరీతమైన గర్వం. ముఖ్యంగా తన తల్లివైపు వాళ్లంటే చిన్నచూపు.

తను 'డిబేట్'లో చెప్పిన విషయాలు మనసులో కదులుతూ వుంటే ఏంచేయాలో తోచక మెల్లగా తల్లిదగ్గరకు వెళ్లి, తన వుద్దేశ్యం బయటపెట్టింది. వినటంతోనే అంతవరకు ఎంతో ముద్దుగా చూస్తున్న తల్లి కూడా ఇంతెత్తున ఎగిరింది. "చాల్లే, నీ చాదస్తం? ఏం, మహేష్‌కి ఏం తక్కువ? నీకు బావవరస... చక్కని అందగాడు. ఆస్తిపరుడు. పైగా పెద్దఅత్తయ్యకు నువ్వంటే ఎంత ప్రేమో తెలుసా? "సిరిరామోకాలడ్డినట్లు" మంచి సంబంధాన్ని నీ మూర్ఖత్వంతో పోగొట్టుకోకు. నువ్వు చెప్పే నీతులన్నీ కథలలో బాగానేవుంటాయి. ఇది నిజజీవితమని తెలుసుకో. ఈ సంబంధం కుదరటానికి మీ నాన్నగారు ఎంత శ్రమపడ్డారో తెల్సా? ఏదో మనవాళ్లు కాబట్టి యాభైవేలకి ఒప్పుకున్నారు. బయట వాళ్లయితే రెండులక్షలకు తగ్గరు. నీ మంచి మాకు తెలుసా? నీకు తెలుసా? పిచ్చి పిచ్చి వేషాలుమాని నోరు మూసుకు కూర్చో" అని తీవ్రంగా మందలించింది.

తనకి బావ డబ్బుకాని, అందంగాని, చదువుకాని లెక్కలేదు. ఇప్పుడే తమని అంత చులకనగా చేసేబావ రేపు పెళ్లైన తరువాత ఇంకెంత చులకనగా చూస్తాడో నని బాధ. వాళ్లని అంత బతిమాలి సంబంధం కుదుర్చుకోవలసిన అవసరం ఏమిటో అర్థంకాక, తనని ఎవరు పట్టించుకోరని, తనమాట ఎవరు వినరని తెలిసిన కల్పన నీరసపడి దిగాలుపడి మౌనంగా వుండిపోయింది.

తర్వాత తతంగం అంతా యాంత్రికంగా గడిచిపోయింది. పెళ్లిరోజున పీటలమీదకు వెళ్తుంటే తను వక్తృత్వపు పోటీలలో గెల్చుకున్న వెండికప్పు "ఇదేనా నీ ఆశయం నెరవేర్చుకోవటం" అని వెక్కిరించినట్లయింది. దాన్నితీసి పెట్లో దాచేసింది.

ఫలించని తనఆశయం గురించి దిగులుపడుతూ, పెళ్ళి బాజాలుమోగుతుంటే, గర్వంగా చూస్తున్న బావ పక్కన తలవంచుకుని కూచుని మూడుముళ్లు వేయించుకుని శ్రీమతి మహేష్ అయింది—ఈనాటి నగటు యువతి కల్పన!

—జె.రమ